భద్రత ప్రశ్నార్థకం!

- పలు కార్యాలయాలకు కూలిన ప్రహరీ గోడలు
- రక్షణ కరువైందని ఆందోళన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు
- ఏళ్లు గడిచినా పట్టించుకోని అధికారులు



వరదయ్యపాళెం: కూలిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రహరీ గోడ

ప్రజోపయోగ పనుల సంగతి దేముడెరుగు.. కనీసం ప్రభుత్వ కార్యాలయాల నిర్వహణను సైతం అధికారులు పట్టించుకోవడం లేదు. రెండేళ్ల క్రితం భారీ వర్షాలకు కూలిన ప్రహరీ గోడలను పునర్నిర్మించే దిశగా చర్యలు చేపట్టడం లేదు. దీంతో ఆయా ఆఫీసుల్లోని సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా రాత్రివేళల్లో భద్రత కరువైందని వాపోతున్నారు. మందుబాబులు.. ఆకతాయిల బెడద అధికంగా ఉంటోందని ఆవేదన చెందుతున్నారు. అలాగే పశువుల సైతం లోపలికి ప్రవేశించి బీభత్సం సృష్టిస్తున్నాయని వెల్లడిస్తున్నారు.

వరదయ్యపాళెం: రెండేళ్ల క్రితం కురిసిన భారీ వర్షాలకు వరదయ్యపాళెంలోని పలు ప్రభుత్వ కార్యాలయాల ప్రహరీ గోడలు నేలకూలాయి. అయితే ఆయా చోట్ల నూతన ప్రహరీ గోడల నిర్మాణం ఇప్పటి వరకు చేపట్ట లేదు. దీంతో సంబంధిత కార్యాలయాలకు రాత్రివేళల్లో భద్రత కరువవుతోంది.

చెట్లు కూలి..

వరదయ్యపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రహరీ గోడపై భారీ వర్షాలకు చెట్లు కూలి రెండు చోట్ల 25 మీటర్ల మేర గోడ కూలిపోయింది. అందులో నుంచి పీహెచ్‌సీ ప్రాంగణంలోకి పశువులు ప్రవేశిస్తున్నాయి. దీంతో పలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందిన వైద్య సిబ్బంది వాపోతున్నారు. అలాగే రాత్రివేళల్లో మందుబాబులు మద్యం తాగేందుకు వస్తున్నారు. అలాగే పలు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు.

పంచాయతీ కార్యాలయం వద్ద ఇదే పరిస్థితి

వరదయ్యపాళెం మేజర్ పంచాయతీ కార్యాలయం వద్ద వర్షాలకు 30 మీటర్ల మేర ప్రహరీ గోడ కూలింది. దీంతో ఈ కార్యాలయానికి భద్రత సమస్య తలెత్తింది. రాత్రివేళల్లో కార్యాలయ ప్రాంగణంలో చెత్త సేకరణకు వినియోగించే వాహనాలను అక్కడే ఉంచుతారు. అయితే వాటికి రక్షణ కరువైంది. చెత్త సేకరణ బండ్ల నుంచి ఏ పరికరాలు ఊడదీసుకెళ్లినా దిక్కులేని పరిస్థితి. దీనిపై అధికారులు స్పందించాల్సి ఉంది.

ప్రభుత్వానికి నివేదించాం



వర్షాల కారణంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం చుట్టూ రెండుచోట్ల ప్రహరీ గోడ కూలింది. ఈ ప్రాంతంలో నూతన ప్రహరీ గోడ నిర్మాణం కోసం ప్రభుత్వానికి నివేదించాం. అయితే ఇప్పటి వరకు నిర్మాణం చేపట్టలేదు. పేద ప్రజలకు వైద్యం చేపట్టే ఆస్పత్రిలో అనేక విలువైన పరికరాలు ఉన్నాయి. దెబ్బతిన్న ప్రాంతంలో ప్రహరీ గోడ నిర్మించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

–ద్వైత, వైద్యాధికారి, వరదయ్యపాళెం పీహెచ్‌సీ

త్వరలోనే నిర్మాణం చేపడతాం



పంచాయతీ కార్యాలయం ప్రహరీ గోడ రెండేళ్ల క్రితం కురిసిన భారీ వర్షాలకు కొంతమేరకు పడిపోయింది. ఆ ప్రాంతంలో నూతన ప్రహరీ గోడ నిర్మాణం కోసం ఇటీవల జరిగిన పంచాయతీ అభివృద్ధి సమావేశంలో ప్రస్తావించాం. పాలక వర్గం కూడా ప్రహరీ నిర్మాణానికి సానుకూలంగా స్పందించింది. త్వరలో నిర్మాణం చేపడుతాం.

–బసిరెడ్డి, ఈఓ, వరదయ్యపాళెం పంచాయతీ

క్లుప్తంగా

చిన్నపాండూరులో ట్రాఫిక్‌జామ్



వరదయ్యపాళెం: మండలంలోని సత్యవేడు–కదూరు రోడ్డులో చిన్న పాండూరు దళితవాడ వద్ద శనివారం రాత్రి రెండు లారీలు ఇరుక్కుపోవడంతో ట్రాఫిక్ జామ్ అయ్యింది. పైప్‌లైన్ల కోసం తీసిన గుంతల్లో సాయంత్రం 6 గంటలకు వాహనాలు దిగబడడంతో ఇరువైపులా రాకపోకలు స్తంభించాయి. పోలీసులు, అధికారులు పట్టించుకోకపోవడంతో రాత్రి 9 గంటల వరకు వాహనదారులకు ఇక్కట్లు తప్పలేదు. తర్వాత నింపాదిగా అధికారులు ఘటనాస్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

ట్రాన్స్‌కో ఏఈగా వాసుదేవయ్య

సత్యవేడు: ట్రాన్స్‌కో ఏఈగా వాసుదేవయ్య శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఏర్పేడు నుంచి ఆయన బదిలీపై సత్యవేడుకు వచ్చారు. ఏఈ మాట్లాడుతూ మండలంలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

రేణిగుంట: మండలంలోని గుత్తివారిపల్లిలో డయేరియాతో ఇద్దరు మృతి చెంది, 40 మంది వరకు ఆస్పత్రి పాలైన సంఘటనలో జిల్లా పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టారు. పంచాయతీ కార్యదర్శి మల్లికార్జునను సస్పెండ్ చేశారు. ఇన్‌చార్జ్ ఎంపీడీవో ప్రభురావుకు షోకాజ్ నోటీస్ ఇచ్చినట్లు సమాచారం.

అంబేడ్కర్ విగ్రహం ముందు నిరసన

రేణిగుంట: స్థానిక పంచాయతీ కార్యాలయంలో గురువారం దళిత సర్పంచ్‌కు జరిగిన అవమానానికి నిరసనగా శనివారం మండల ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాంట్ ఐక్యవేదిక ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ విగ్రహం ముందు నిరసన తెలిపారు. పంచాయతీ అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నాయకుడు సిహెచ్ బజయ్య, తులసి రాజన్, ఓ వెంకటరమణ, హరినాథ్, మురళి, ఈశ్వరి పాల్గొన్నారు.

వేడుకగా ఊంజల్ సేవ

నారాయణవనం: పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం సాయంత్రం దేవదేవేరులకు వేడుకగా ఊంజల్ సేవ నిర్వహించారు. అనంతరం తిరుచ్చి వాహనంపై దేవదేవేరులను కొలువుదీర్చారు. ఆలయ అధికారి నాగరాజు, ఆర్జితం అధికారి భరత్, అర్చకుడు నరసింహభట్టాచార్యులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా పవిత్రోత్సవాలు



యాగశాల వద్ద పూజలు చేస్తున్న వేదపండితులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో పవిత్రోత్సవాలు శాస్త్రోక్తంగా కొనసాగుతున్నాయి. ఆలయంలోని యాగశాలలో పూజలు చేసి ప్రాయశ్చిత ఉపచార పూజలు చేశారు. నాలుగో రోజైన శనివారం యాగశాలలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు స్వామినాథన్ ఆధ్వర్యంలో విశేష పూజలు జరిపి పూర్ణాహారతులు సమర్పించారు. అనంతరం ఆలయ అర్చకులు, అధికారులు పూజా ద్రవ్యాలను ఆలయంలో ఊరేగింపుగా ప్రదక్షిణలు చేసి శ్రీ–కాళ–హస్తి, భరద్వాజ మహర్షి ఉత్సవమూర్తుల వద్దకు విచ్చేశారు. అక్కడ వేదపండితులకు పూజాద్రవ్యాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

త్వరితగతిన వినతుల పరిష్కారం

బుచ్చినాయుడుకండ్రిగ: గ్రీవెన్స్‌లో వివిధ సమస్యలపై వచ్చిన వినతులను త్వరితగతిన పరిష్కరించాలని తహసీల్దార్ శ్రీదేవి ఆదేశించారు. శనివారం అధికారులతో సమావేశం నిర్వహించారు. శ్మశాన స్థలాలు కబ్జాకు గురికాకుండా చర్యలు చేపట్టాలన్నారు. అన్నదాత సుఖీభవ నగదు జమ కాని రైతుల ఆధార్‌లను పాస్‌పుస్తకాలతో జతపరచాలని సూచించారు. స్మార్ట్ రేషన్ కార్డులను సక్రమంగా పంపిణీ చేయాలని స్పష్టం చేశారు. భూ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. సమావేశంలో సీనియర్ అసిస్టెంట్ నాగరాజురెడ్డి పాల్గొన్నారు.

నందిపై పరాశరేశ్వరస్వామి



నారాయణవనం: చంపకవల్లీ సమేత పరాశరేశ్వరస్వామి శనివారం రాత్రి అధికార నంది వాహనంపై విహరించారు. పవిత్రోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం వైభవంగా పవిత్రాలను సమర్పించారు. సాయంత్రం పరాశరేశ్వరస్వామి అమ్మ వారి సమేతంగా అధికార వాహనం అధిరోహించి ఊరేగారు. ఆలయ అధికారి నాగరాజు, అర్చకుడు రమేష్ గురుకుల్, ఆర్జితం అధికారి భరత్ పాల్గొన్నారు.

నానో యూరియా ఎంతో మేలు

శ్రీకాళహస్తి: నానో యూరియా వాడకంతో రైతులకు ఖర్చు తక్కువ ఆదాయం ఎక్కువ అని ఏడీఏ రమేష్ రెడ్డి తెలిపారు. మండలంలోని తొండమనాడు రైతు సేవా కేంద్రం వద్ద రైతులకు శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నానో యూరియా, నానో డీఏపీ అందుబాటులో ఉన్నాయని తెలిపారు. దుక్కిలో సిఫారసుల మేరకు కాంప్లెక్స్ ఎరువులను వేసుకొని, పైరుపై పిచికారీ చేసే ఎరువులను స్ప్రే చేసుకుంటే తక్కువ ఖర్చుతో మంచి దిగుబడిని పొందవచ్చన్నారు. ఉదాహరణకు వరిలో పిలకలు పెట్టే దశలో నానో యూరియా, నానో డీఏపీ, ఫార్ములా–4 కలిపి స్ప్రే చేసుకోవచ్చని తెలిపారు. చిరుపొట్ట దశలో నానో యూరియా, 13–0–45 కలిపి స్ప్రే చేసుకుంటే తక్కువ ఖర్చులో మంచి ఫలితాలు వస్తాయన్నారు. పైరుపై స్ప్రే చేసే ఎరువుల వాడకం వలన చీడల సమస్య తగ్గుతుంది. పంటలకు వివిధ దశలలో అవసరమైన పోషకాలు నేరుగా ఆకులకు అందించి అధిక దిగుబడులను పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవో(టీఏ) సూర్య ప్రకాష్ రెడ్డి, ఇఫ్కో సేల్స్ మేనేజర్ మణిచంద్ర, ఆర్‌ఎస్‌కే సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటుకు డిమాండ్



ఆటో యూనియన్ నేతలు

వరదయ్యపాళెం: ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ సత్యవేడు నియోజకవర్గ గౌరవాధ్యక్షుడు చిన్నిరాజ్ డిమాండ్ చేశారు. శనివారం వరదయ్యపాళెంలో ప్రజా ఆటో స్టాండ్‌ను ప్రారంభించారు. చిన్నిరాజ్ మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో తీవ్రంగా నష్టపోతున్న ఆటో డ్రైవర్లకు ప్రత్యామ్నాయ ఉపాధి చూపాలని కోరారు. తక్షణమే ఆటో డ్రైవర్లకు రూ. 15వేలు వాహనమిత్రను పంపిణీ చేయాలన్నారు. అనంతరం ఆటో యూనియర్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా ఏ. చిన్నిరాజ్, అధ్యక్షుడిగా డి. కుమార్, ఉపాధ్యక్షుడిగా వెంకటయ్య, కార్యదర్శిగా సుబ్రమణ్యం, సహాయ కార్యదర్శిగా బి. సుబ్రమణ్యం, కోశాధికారిగా జంషేర్ అలీ ఎన్నికయ్యారు.

ప్రభుత్వాస్పత్రికి స్ట్రెచర్ వితరణ



స్ట్రెచర్ అందజేస్తున్న బాలుయాదవ్

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి శనివారం విజయ ఏజెన్సీ స్టీల్ అండ్ సిమెంట్ దుకాణ నిర్వాహకుడు బాలుయాదవ్ స్ట్రెచర్ వితరణ చేశారు. సూపరింటెండెంట్ మణి స్వీకరించి దాతకు కృతజ్ఞతలు తెలిపారు. బాలు యాదవ్ మాట్లాడుతూ ప్రభుత్వాస్పత్రికి ఎంతో ఉపయోగంగా ఉంటుందని ఈ స్ట్రెచర్ అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, నర్సులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

బుచ్చినాయుడుకండ్రిగ: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి మురళీధర్‌రెడ్డి సూచించారు. శనివారం మండలంలోని ఏకలవ్య గురుకుల పాఠశాలలో విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. వైద్యాధికారి మాట్లాడుతూ చేతులను శుభ్రం చేసుకుని భోజనం చేయాలని, వేడిగా ఉన్న ఆహారాన్ని తినాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ధరేంద్రసింగ్, సీహెచ్‌ఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మోదీ మెతక వైఖరి వీడాలి



నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాల నేతలు

శ్రీకాళహస్తి: అమెరికా సుంకాలపై మోదీ మెతక వైఖరి వీడాలని సీపీఎం శ్రీకాళహస్తి ప్రాంతీయ కార్యదర్శి గంధం మణి డిమాండ్ చేశారు. స్థానిక పెండ్లి మండపం వద్ద శనివారం వామపక్షాల ఆధ్వర్యంలో భారత్‌పై ట్రంప్ సుంకాలకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ట్రంప్ భారత్‌పై విధించిన 50 శాతం సుంకాల వల్ల టెక్స్‌టైల్స్, గార్మెంట్స్ వంటి ఉత్పత్తుల ధరలు పడిపోయాయన్నారు. దేశ సముద్ర ఉత్పత్తుల్లో 40 శాతం ఎగుమతులు ఆంధ్రప్రదేశ్ నుంచి అవుతున్నాయని, ఏటా సుమారు రూ.2 వేల కోట్ల డాలర్ల విలువైన వ్యాపారం జరుగుతున్నట్లు గుర్తు చేశారు. రొయ్యల ధరలు ఘోరంగా పడిపోవడంతో సముద్ర తీర ప్రాంతాల్లోని ఆక్వా రైతులు తీవ్ర సంక్షోభంలో చిక్కుకున్నారని వాపోయారు. గార్మెంట్స్, టెక్స్‌టైల్స్ రంగాల్లో పని చేస్తున్న వేలాది మంది కార్మికుల ఉపాధికి గండం ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఐ నేతలు కత్తి రవి, మల్లికార్జున్, సీపీఎం నేతలు వేణు, కుమార్, రాపూరు సుబ్రమణ్యం, గురునాథం, అన్వర్ బాషా పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై ఆగ్రహం

తిరుపతి కల్చరల్: నాగలాపురం మండలం వెల్లూరు, వెంబాకం, ఎస్‌ఎస్‌పురం, బీరకుప్పం, చిన్నాపట్టు పంచాయతీల ఇన్‌చార్జి కార్యదర్శి పరంధామ ఇష్టారాజ్యంగా నిధులను దుర్వినియోగం చేశారని వెల్లూరు కార్యదర్శి యుగంధర్, ఎస్‌ఎస్‌పురం సర్పంచ్ కుమారుడు లీలాకృష్ణ మండిపడ్డారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడారు. 6 పంచాయతీలకు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న పరంధామ 15వ ఆర్థికసంఘం నిధుల్లో సుమారు రూ.35లక్షల నుంచి రూ.40లక్షల వరకు దుర్వినియోగం చేశారని ఆరోపించారు. దీనిపై అధికారులు సమగ్ర విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు.

స్వర్ణముఖిలో అక్రమ తవ్వకాలు



స్వర్ణముఖి నదిలో అక్రమ తవ్వకాలు చేస్తున్న జేసీబీ, ట్రాక్టర్లు



విలేకరులను చూసి వెళ్లిపోతున్న వాహనాలు

రేణిగుంట: మండలంలోని కిష్టయ్య కాలువ సమీపంలో ఉన్న స్వర్ణముఖి నదిలో శనివారం ఉదయం జేసీబీలు, ట్రాక్టర్లతో ఇసుక అక్రమంగా తవ్వడం మొదలెట్టారు. విలేకరులు వెళ్లి ఫొటోలు తీయడం గమనించి అక్రమ తవ్వకాలను నిలిపివేసి వాహనాలను తీసుకొని వెళ్లిపోయారు. నిత్యం వందల సంఖ్యలో వాహనాలతో ఇసుక అక్రమ రవాణా సాగుతున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. స్వర్ణముఖి నది నుంచి ఇసుకను తీసుకొని గాజుల మండ్యం పోలీస్ స్టేషన్ ముందు నుంచే దర్జాగా వెళుతుండడం గమనార్హం. ఎస్‌ఐ సుధాకర్‌ను సంప్రదించగా అక్రమ తవ్వకాలను ఉపేక్షించేది లేదని, ఇప్పటికే పలుమార్లు దాడులు నిర్వహించి కేసులు నమోదు చేశామని తెలిపారు.

నానో యూరియాపై అవగాహన

బుచ్చినాయుడుకండ్రిగ: నానో యూరియా, డీఏపీ, బయో ఫర్టిలైజర్‌పై వ్యవసాయాధికారి షణ్ముగం రైతులకు శనివారం అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ అర లీటర్ నానో యూరియా, డీఏపీలు ఒక బస్తా యూరియా, డీఏపీలతో సమానమని తెలిపారు. అర లీటర్ రూ.250కే లభిస్తుందని వెల్లడించారు. అనంతరం నానో యూరియా, డీఏపీని వినియోగించిన రైతులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ రేవతి పాల్గొన్నారు.

నానో ఎరువులపై అవగాహన అవసరం

వరదయ్యపాళెం: యూరియా కొరత నేపథ్యంలో ప్రత్యామ్నాయంగా నానో ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన అవసరమని ఏఓ గౌరీ తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ నానో ద్వారా యూరియా, డీఏపీ, పొటాష్ వంటి ఎరువులు లిక్విడ్ రూపంలో అందుబాటులోకి వస్తాయని వెల్లడించారు. ఎకరా పంటకు 500ఎంఎల్ యూరియా, 600ఎంఎల్ డీఏపీ పిచికారీ చేసుకోవాలని సూచించారు. ఏఈఓ ప్రవీణ్ పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ కమిటీ ప్రమాణ స్వీకారం

రేణిగుంట: పట్టణంలోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో శనివారం రేణిగుంట జంక్షన్ లయన్స్ క్లబ్ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి డిస్ట్రిక్ గవర్నర్ లయన్ అశ్వత్‌నారాయణ స్వామి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. క్లబ్ అధ్యక్షుడు జూలియన్ రాజు,కార్యదర్శి రాజేంద్రన్, కోశాధికారి కోటేశ్వరరావు, పాలకవర్గ సభ్యుల చేత ప్రమాణ స్వీకారం చేయించి నియామక పత్రాలను అందించారు.

గుండెపోటుతో వ్యక్తి మృతి

ఏర్పేడు: మండలంలోని చింతలపాళెంలో గుండెపోటుతో వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు, చింతలపాళెం గ్రామానికి చెందిన కారు డ్రైవర్ ఎస్.శ్రీధర్(45) ఆలయ కుంభాభిషేకంలో పాల్గొన్నాడు. గుండెపోటుతో మృతి చెందాడు. దీంతో కుంభాభిషేక మహోత్సవాన్ని అర్ధంతరంగా నిలిపేశారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.